నిధుల వర్షం..!

అభివృద్ధి, సంక్షేమం, ఉపాధికి బాటలు



వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక నిధులు
పారిశ్రామిక కారిడార్‌తో కొత్త పరిశ్రమలు
యువతకు పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
ప్రధాన మంత్రి అన్నయోజన పొడిగింపు.. రైతులకు మేలు
కేంద్ర బడ్జెట్‌పై అన్ని వర్గాల హర్షం

అనంతపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామి కావడంతో కొత్త ప్రభుత్వం తొలి వార్షిక బడ్జెట్ ఉత్కంఠ రేపింది. సీఎం చంద్రబాబు ఏ మేరకు రాష్ట్ర ప్రయోజనాలకు నిధులు తెస్తారోనన్న ఆసక్తి సర్వత్రా కనిపించింది. జనం పెట్టుకున్న ఆశలకు ఏమాత్రం తీసిపోకుండా.. ఆయన నిధులను సాధించారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతోంది. కరువు జిల్లా అభివృద్ధి, సంక్షేమం, ఉపాధికి బాటలు వేసేలా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారని అన్ని వర్గాలు అంటున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మంగళవారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. అందులో రాష్ట్రానికే కాకుండా జిల్లా అభివృద్ధికి ఊతమిచ్చేలా నిధులు కేటాయించారు. విభజన హామీల మేరకు వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని ప్రకటించారు. ప్రధాన మంత్రి అన్న యోజన పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగించారు. తద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. పంట దిగుబడులకు మద్దతు ధర లభించనుంది. నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తామని చెప్పడం రైతులకు కలిసొచ్చే అంశం. యువతకు ఉద్యోగాల కల్పన, విద్య, ఉపాధి నైపుణ్యానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. వేతన జీవులకు కొత్త పన్ను విధానం స్వల్ప ఊరటనిచ్చింది. ఉన్నత విద్యకు గతంలో రూ.10 లక్షల రుణం మంజూరు చేసేవారు. ఈ బడ్జెట్‌లో రూ.20 లక్షలకు రుణం పెంచారు. హైదరాబాదు-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటు కరువు జిల్లాకు కలిసొచ్చే అంశం. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటవుతాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. బడ్జెట్‌పై వివిధ పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించారు. ఇది మెరుగైన బడ్జెట్ అని, జిల్లా అభివృద్ధికి ఉపయుక్తమని అన్నారు. అయితే, నిధులపై స్పష్టత కొరవడిందని వామపక్షాలు అన్నాయి.

అభివృద్ధికి చేయూత..



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంతో పాటు జిల్లా అభివృద్ధికి ఆర్థిక చేయూత లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో రాజధాని నిర్మాణం ఇక నుంచి పరుగులు పెట్టనుంది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో స్పష్టమైన హామీ లభించింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ నిధులు మంజూరు చేస్తామని బడ్జెట్‌లో స్పష్టమైన హామీ ఇచ్చారు. కరువు జిల్లా అనంత అభివృద్ధికి ఆ నిధులు దోహదపడతాయి. పారిశ్రామిక కారిడార్‌తో కరువు జిల్లాకు పరిశ్రమలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తొలి బడ్జెట్‌లోనే రాష్ట్రంతో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేసినందుకుగానూ ప్రజల పక్షాన ప్రధాని మోదీకి, ఆ మేరకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.
- అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీ

చంద్రబాబు కృషితో మంచి రోజులు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో ఏపీకి మంచి రోజులు వస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులే ఇందుకు నిదర్శనం. గత ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసింది. చంద్రబాబు సీఎం అయిన తర్వాత అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇస్తామని కేంద్రం చెప్పడం హర్షణీయం. పోలవరం ప్రాజెక్టును 200 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించేందుకు పూర్తి ఖర్చు కేంద్రం భరిస్తుందని బడ్జెట్‌లో చెప్పారు. ఇది పూర్తైతే రాయలసీమకు నీటి కష్టాలు తీరే అవకాశం ఉంది. ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయింపుతో కరువు జిల్లా అనంతకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఒక మంచి నాయకుడు సీఎం అయితే రాష్ట్రానికి ఇలా మంచి జరుగుతుంది.
- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

అభివృద్ధి పరుగులు..



ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెట్టడం ఖాయం. కేంద్ర బడ్జెట్‌లో ఈ సారి రాష్ట్రానికి న్యాయం జరిగింది. విజన్ కలిగిన సీఎం చంద్రబాబునాయుడు కృషితోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందనుంది. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ప్రకటించడం హర్షణీయం. రాయలసీమ, ప్రకాశం, కోస్తాలో వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పడంతో ఉమ్మడి జిల్లాకు మేలు చేకూరనుంది. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచే రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి.
- వెంకటశివుడు యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

తొలిసారి న్యాయం..



రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తొలిసారిగా న్యాయం జరిగింది. అమరావతికి రూ.15 వేల కోట్లు ఇవ్వడం ద్వారా కలల రాజధాని నిర్మాణానికి వేగంగా అడుగులు పడతాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్రంగా స్పష్టంగా హామీ ఇచ్చింది. వీలైనంత త్వరగా నిధులు కేటాయిస్తే ప్రజలు సంతోషిస్తారు. రాయలసీమకు ఈ సారి న్యాయం చేశారు. ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాల నిధులు ఇస్తామని చెప్పడంతో ప్రజలు సంతోషిస్తున్నారు. పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనకు నిధులు ఇవ్వడం ద్వారా పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది.
- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

చేతల్లో చూపింటే బాగుండేది..



వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ ఇస్తామని రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయించకుండా.. కేవలం మాటలు చెప్పారు. అలా కాకుండా చేతల్లో చూపించి ఉంటే బాగుండేది. అలా చేయకపోవడంతో కరువు జిల్లా అనంత ప్రజానీకం నిరాశకు లోనయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణానికి బహుళ సంస్థల ద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వమే గ్రాంటు రూపంలో రూ.15 వేల కోట్లు కేటాయించాల్సింది. ఆ విధంగా చేయకపోవడం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టడమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా.. బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయం. విభజన హామీల అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప.. వాటికి నిధుల ప్రస్తావన లేదు. బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించని నేపథ్యంలో... రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మరిన్ని నిధుల కోసం కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.
- రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

నిధులపై స్పష్టత ఇచ్చుంటే బాగుండేది...



కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులపై స్పష్టత ఇచ్చుంటే బాగుండేది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ విషయంలో బడ్జెట్‌లో మాటలు చెప్పారు. కానీ ఎప్పటి నుంచి నిధులు మంజూరు చేస్తారు..? జిల్లాకు రూ.50 కోట్లు ఇస్తారా..? ఇంకా ఎక్కువ ఇస్తారా..? అనే విషయంలో స్పష్టత లేదు. విభజన హామీల అమలు ఊసెత్తకపోవడం బాధాకరం. హైదరాబాదు నుంచి బెంగళూరు దాకా పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేస్తామని చెప్పారేగాని... ఎక్కడ పరిశ్రమలు పెడుతున్నారు..? ఏ ఏ పరిశ్రమలు తీసుకురానున్నారో బడ్జెట్‌లో స్పష్టంగా చెప్పలేదు. రాజధాని నిర్మాణ విషయంలోనూ నిధుల కేటాయింపులో కప్పదాట్లే ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రాంటు రూపంలో రాజధాని నిర్మాణానికి నిధులివ్వకుండా బహుళసంస్థల ద్వారా అప్పు ఇప్పిస్తామని చెప్పినట్లుగా ఉండటం విచారకరం. తద్వారా రాష్ట్రానికి అప్పు ఇప్పిస్తున్నామని కేంద్రం చెప్పకనే చెబుతోంది. నిధులు రాబట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంది.
- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఆ ఇద్దరి మార్క్ కనబడింది...



కేంద్ర బడ్జెట్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మార్క్ స్పష్టంగా కనిపించింది. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు రాబట్టారు. వెనుకనబడిన ప్రాంతాలకు నిధులతో కరువు జిల్లా అనంత అభివృద్ధికి బాటలు వేసినట్లయింది. హైదరాబాదు-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌తో జిల్లాకు అనేక పరిశ్రమలు వస్తాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మొదటి బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రంపై ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయం.
- భవానీ రవికుమార్, జనసేన నాయకుడు

రాష్ట్రానికి పెద్దపీట...



ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడితే ఏపీని అభివృద్ధి బాటలో నడిపిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ మేరకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. వ్యవసాయం, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల పెంపు, పట్టణాభివృద్ధి.. ఇలా అన్ని రంగాలకు నిధులు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం కేంద్రాన్ని ప్రజల్లో దోషిగా చూపేందుకు నిధులను దుర్వినియోగం చేసింది.
- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు మంచి రోజులు..



కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేశారు. విద్యార్థులకు మంచిరోజులు వచ్చాయి. విద్యార్థుల నైపుణ్య శిక్షణకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. పారిశ్రామికరంగ విస్తరణకు బాటలు వేశారు. ఈ అంశాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతాయి.
- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

అంకుర పరిశ్రమలకు తోడ్పాటు..



అంకుర పరిశ్రమలకు (స్టార్టప్) బడ్జెట్‌తో తోడ్పాటు కల్పించారు. పెట్టుబడికి పన్ను మినహాయించి.. స్టార్టప్‌లను ప్రోత్సహించారు. పారిశ్రామిక కారిడార్‌లను అనుసంధానం చేస్తూ.. మౌళిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి బడ్జెట్‌కు వన్నె తీసుకువచ్చారు. ఈ బడ్జెట్‌ను పరిశ్రమలు అభివృద్ధికి సూచికగా భావించవచ్చు.
- ప్రొఫెసర్ నాగభూషణరాజు, ఎస్కేయూ

భీమలింగేశ్వరా..! శరణం

వైభవంగా స్వామివారి రథోత్సవం


స్వామి వారి మహా రథాన్ని లాగుతున్న భక్తులు

విడపనకల్లు, జూలై 23: మండలంలోని గడేకల్లు గ్రామంలో వెలసిన వేములవాడ భీమలింగేశ్వరస్వామి మహా రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం స్వామికి ప్రీతి పాత్రమైన మద్యాన్ని, మాంసాన్ని నైవేద్యంగా పెట్టి పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెల్లరుజామున ఉత్సాయంను ఆలయం వద్ద నుంచి గ్రామ చావడి వరకూ లాగారు. సాయంత్రం నిర్వహించిన మహా రథోత్సవ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. కర్నూలు, బళ్లారి, అనంతపురం, బెంగళూరు, వంటి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గడేకల్లు గ్రామానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి ప్రజలు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల్లో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాయంత్రం భీమలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తిని మేళతాళాల తో ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయం ఎదుట మంటపంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహారథంలో కొలువు దీర్చారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని ఆలయం నుంచి గ్రామంలోని బొడ్రాయి వరకూ లాగారు. తిరిగి ఆలయం వద్దకు రథం రావటంతో వేడుకలు ముగిశాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి


స్థానిక రైల్వే స్టేషన్‌లో కంజర్వేటివ్ కమిటీ సమావేశం

గుంతకల్లు, జూలై 23: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని రైల్వే స్టేషన్ కంజర్వేటివ్ కమిటీ సభ్యులు అధికారులకు సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం కంజర్వేటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కమిటీ సభ్యులు గోపా జగదీశ్, చెల్లూరు గోపీనాథ్, పరుచూరు సత్యరంగయ్య తదితరులు మాట్లాడుతూ గుంతకల్లు స్టేషన్‌లో రైలు వచ్చే సమ యానికి 15 నిమిషాల ముందు అది ఏ ప్లాట్‌ఫారంపైకి వస్తుందనే విషయం అనౌన్స్ చేయాలన్నారు. 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, వృద్ధులు ప్లాట్‌ఫాంల్లోకి రావడానికి బ్యాటరీ వెహికల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో అమ్మే తినుబండారాల నాణ్యతను పెంచాలని, గతంలో ఉన్న కర్నూలు డే ప్యాసింజరును పునరుద్ధరించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజరు మురారిలాల్ మీనా, అధికారులు జాఫర్ ఖాన్, జీకే బాషా, కమిటీ సభ్యులు గోపా జగదీశ్, చెల్లూరు బద్రీనాథ్, పరుచూరు సత్యరంగయ్య, ఆర్‌సీ సురేశ్ గౌడు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

సరైన మందులు అందించండి

న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్


ఆసుపత్రిలో మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, జూలై 23: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సరైన మందులు అందించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. మానసిక అనారోగ్య వార్డు, వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. మానసిక రోగులు పరిస్థితిని వైద్యులతో ఆరా తీశారు. అనంతరం నలంద కళాశాలలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్తు కోల్పోరాదన్నారు. ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, న్యాయవాది హరికృష్ణ, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చేశాయ్

జిల్లా సరిహద్దుకు చేరిన తుంగభద్ర జలాలు




బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 కి.మీ. చేరుకున్న తుంగభద్ర జలాలు, పూజలు నిర్వహిస్తున్న హెచ్చెల్సీ లస్కర్లు

బొమ్మనహాళ్, జూలై 23: తుంగభద్ర జలాలు జిల్లా సరిహద్దులోకి ప్రవేశించాయి. జలాశయం నుంచి నీటిని సోమవారం ఉదయం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి విడుదల చేశారు. దీంతో మంగళవారం రాత్రి 7.30 గంటలకు ఆంధ్రా సరిహద్దు బొమ్మనహాళ్ వద్ద 105.272 కి.మీ. రెగ్యులేటర్ వద్దకు నీళ్లు వచ్చాయి. దీంతో హెచ్చెల్సీ అధికారులు, ఆయకట్టు రైతులు పూజలు చేసి స్వాగతం పలికారు. జలాశయంలో ఎగువకాలువ(హెచ్చెల్సీ)కి నీరు విడుదల చేసినపుడు మూడు లేదా నాలుగురోజులకు నీరు ఆంధ్రా సరిహద్దుకు చేరేవి. అయితే కర్ణాటకలో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేయడంతో నీరు వేగంగా ఆంధ్రా సరిహద్దుకు చేరింది. ప్రస్తుతం జలాశయం నుంచి 2,304 క్యూసెక్కులు హెచ్చెల్సీకి వస్తున్నట్లు అధికారు లు తెలిపారు. ఆంధ్రా సరిహద్దుకు 500 క్యూసెక్కులు నీరు చేరుతోంది. బుధవా రం రాత్రికి కణేకల్లు చెరువుకు నీరు చేరుతాయని అధికారులు అన్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి 92,636 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో 92.01 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు అన్నారు.

కమిట్‌మెంట్‌తో పని చేయండి

● రోగులను ప్రేమగా పలకరించండి ● డాక్టర్లకు కలెక్టరు వినోద్ కుమార్ సూచన

అనంతపురం టౌన్, జూలై 23: వైద్యులు, సిబ్బంది కమిట్‌మెంట్‌తో పని చేయాలని జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. జిల్లా ఆస్పత్రిలో మంగళవారం తలసీమియాపై నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ డాక్టర్ వృత్తికి సమాజంలో చాలా గౌరవం ఉంటుందని, మనం ప్రజలకు మంచిగా సేవలందించినపుడు అది మరింత పెరుగుతుందన్నారు. రోగులతో మర్యాదగా, ప్రేమగా మెలగాలని డాక్టర్లకు సూచించారు. తాను డాక్టర్‌గా పని చేసిన మారుమూల ప్రాంతంలో ఎదురైన ఇబ్బందులు, ప్రజలు గౌరవించిన తీరును తెలిపారు. ఇప్పటికీ చాలా మంది వైద్యం కోసం ఆర్‌ఎంపీల వద్దకు వెళుతున్నారంటే పేషంట్ రాగానే ఆప్యాయంగా పలకరించి వైద్యం అందించడమే కారణమన్నారు. కొన్ని సందర్భాల్లో ఆర్‌ఎంపీలు వచ్చీ రాని వైద్యంతో స్టెరాయిడ్స్ ఇచ్చి రోగులను మరింత అనారోగ్యాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వ వైద్యులు కూడా సకాలంలో డ్యూటీకి వచ్చి రోగులతో ప్రేమగా మెలుగుతూ వైద్య సేవలందిస్తే నమ్మకం, గౌరవం పెరుగుతాయని పేర్కొన్నారు. చిత్తశుద్ధితో పని చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు సరిగా చూడరని ఉన్న చెడ్డపేరును తొలగించుకోవాలని కలెక్టరు హితబోధ చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. చిన్నపిల్లలు, గైనిక్, ట్రామాసెంటర్, ఐసీయూ విభాగాలలో అవసరమైన పడకలు, సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తలసేమియా చికిత్సకు సంకల్ప ఫౌండేషన్‌తో ఎంఓయూ

పుట్టుకతోనే తలసేమియా వ్యాధితో అనేకమంది బాధపడుతున్నారు. వారికి అవసరమైన వైద్యం, రక్తం అందించాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇలాంటి వారి కోసం సంకల్ప ఫౌండేషన్ ఇప్పటికే ఆర్డీటీ ఆస్పత్రిలో వైద్యసేవలను అందిస్తోంది. ఈనేపథ్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రిలోను తలసేమియా బాధితులకు తగిన వైద్యసేవలు అందించడం కోసం సంకల్ప ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకోవాలని డీఎంఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో మంగళవారం కలెక్టరు సమక్షంలో సంకల్ప ఫౌండేషన్ సీఈఓ రాకేష్ ఆస్పత్రిలో సేవలు అందించడం కోసం ఎంఓయూ చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, గైనిక్, చిన్నపిల్లల విభాగాల హెచ్‌ఓడీలు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అడ్డుకోండి

జిల్లాలో ఎక్కడా బాల్యవివాహాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాల్యవివాహాల నిర్మూలనపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఏఏప్రాంతంలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయో ఆప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు ఎలా నాశనం అవుతుంది? వారు పడే కష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే బాల్య వివాహాలు చేస్తే చట్టప్రకారం ఎలా శిక్షార్హులవుతారో వివరించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్నిశాఖలు ఈబాల్యవివాహాల నిర్మూలన లో సమష్టిగా, సమన్వయంతో సాగాలని ఆదేశించారు. ప్రధానంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయని అందుకే ఆయా ప్రాంతాల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీ. దేవి తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టరు

అత్త చంపేసిందేమోనని..!

చిన్నారి మృతిపై తండ్రి ఫిర్యాదు

అనంతపురం క్రైం, జూలై 23: తల్లిపాలు తాగి పడుకున్న పసి పాపకు దగ్గు వచ్చింది. ఆ వెంటనే పరిస్థితి విషమించింది. కంగారు పడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పాప చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఇది సహజ మరణం కాదేమోనని పాప తండ్రికి అనుమానం వచ్చింది. నివృత్తి చేసుకునేందుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన అత్తపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు తెలిపాడు. పాప మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక వస్తే.. నిజమేమిటో బయట పడుతుందని పోలీసులు అంటున్నారు. ఈ వ్యవహారం నగరంలో చర్చనీయాంశం అయింది. అనంతపురం నగరానికి చెందిన రవికిరణ్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. రిషా అనే యువతిని ప్రేమించి.. ఏడాదిన్నర క్రితం పెళ్లి చేసుకున్నాడు. తను గర్భం దాల్చి.. ప్రసవం కోసం నాయక్‌నగర్‌లో తన పుట్టింటికి వెళ్లింది. రెండున్నర నెలల క్రితం వారికి పాప పుట్టింది. 'రూబీ' అని ముద్దుపేరు పెట్టుకున్నారు. పాపను చూసేందుకు రవికిరణ్ తరచూ అత్తారింటికి వెళ్లొచ్చేవాడు. ఈ క్రమంలో పాప సోమవారం అనుమానాస్పదంగా మరణించింది. తమ ప్రేమ వివాహం ఇష్టంలేని తన అత్త.. పాప ప్రాణాలు తీసేందుకు కుట్ర చేసి ఉండొచ్చని అనుమానంగా ఉందని టూటౌన్ పోలీసులకు రవికిరణ్ ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం చేయించారు. తల్లిపాలు ఒక్కోసారి శిశువుల ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంటుందని వైద్యులు అంటున్నారు. పోలీసులు, వైద్యుల ప్రాథమిక పరిశీలనలో అనుమానించదగ్గ అంశాలు కనిపించలేదని సమాచారం. పోస్టుమార్టం నివేదిక వచ్చాక అసలు విషయం తెలుస్తుందని సీఐ అన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమావేశాన్ని విజయవంతం చేయండి

రాప్తాడు, జూలై 23: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న అనంతపురంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని గ్రామ /వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం రాప్తాడు గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే సమావేశానికి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ హాజరవుతారన్నారు. గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా సహాధ్యక్షుడు శివశంకర్, ఉపాధ్యక్షులు మహేష్, హనుమంతు, నాయకులు రామాంజినేయులు, రవికుమార్ పాల్గొన్నారు.

జగన్ నీచ రాజకీయాలు మానుకోవాలి

టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర

అనంతపురం అర్బన్, జూలై 23 : మాజీ సీఎం జగన్ నీచ రాజకీయాలు మానుకోకపోతే రాష్ట్ర ప్రజలు ఏపీ నుంచి తరిమేయడం ఖాయమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌కు నిజాయితీ ఉంటే వివేకా హత్య జరిగిన రోజే ధర్నా చేసేవాడన్నారు. అలాకాకుండా వ్యక్తిగతంగా ఇటీవల జరిగిన ఓ హత్యకు రాజకీయ రంగు పులిమి కపట ధర్నా పేరుతో ప్రజల ను మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను హత్య చేయించిన జగన్ ఎలాంటి మచ్చ లేని చంద్రబాబు, నారా లోకేశ్‌పై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన శింగనమల నాయకులు



మంత్రి నారా లోకేశ్‌తో టీడీపీ శింగనమల నాయకులు

బుక్కరాయసముద్రం, జూలై 23: మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ శింగనమల నియోజకవర్గం ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు తదితరులు మంగళవారం రాష్ట్ర సెక్రటేరియట్ కార్యాలయంలో కలిశారు. వారితో పాటు టీడీపీ మండల కన్వీనర్లు అశోక్, పాండు, బాలరంగయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, నియోజకవర్గం అభివృద్ధి తదితర అంశాలపై మంత్రితో చర్చించినట్లు వారు తెలిపారు.

జాషువా వర్ధంతికి తరలిరండి

అనంతపురం కల్చరల్, జూలై 23: జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బుధవారం జాషువా 53 వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటు ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తామన్నారు. అనంతరం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్‌లో జాషువా సాహిత్యంపై సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జాషువా సాహిత్యంపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కాబట్టి సాహితీకారులు, సాహిత్యాభిమానులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జాషువా అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన భవానీ



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న భవానీ రవికుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై23 : ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన హరిప్రసాద్‌కు జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ శుభా కాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో హరిప్రసాద్‌ను మంగళవారం కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై ఎమ్మెల్సీ మాట్లాడారని, జిల్లాలో పార్టీని మరింత పటిష్టపరిచేందుకు పనిచేయాలని సూచించినట్లు భవానీ రవికుమార్ తెలిపారు.

'ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి'

చెన్నేకొత్తపల్లి, జూలై 23: హర్‌ఘర్ జల్ పథకం కింద(జలజీవన్ మిషన్) ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పంచాయతీ కార్యదర్శి శ్యామల తెలిపారు. మండలకేంద్రంలోని సచివాలయం-1లో మంగళవారం హర్‌ఘర్ జల్, ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ... గ్రామాల్లో ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడను నిర్మించుకోవాలని సూచించారు.

బాలుడిపై పోక్సో కేసు

అనంతపురం క్రైం, జూలై 23: నగర శివారులోని ఓ కాలనీలో మూడేళ్ల చిన్నారిపై ఓ బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఇద్దరూ పనికి వెళ్లగా చిన్నారి ఇంటి వద్దే ఉండిపోయింది. వారు తిరిగి వచ్చాక ఇంటి వద్ద చిన్నారి కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెదికారు. కాలనీకి దూరంగా తమ కూతురుతో ఓ బాలుడు అసభ్యంగా ప్రవర్తిస్తూ కనిపించాడు. వారు కేకలు వేయడంతో బాలుడు పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



బండి తిరుపాలు(ఫైల్)

బుక్కరాయసముద్రం, జూలై23: మండల కేంద్రంలోని హెచ్ఎల్సీ వద్ద మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో బండి తిరుపాలు (64) అనే రైతు మృతి చెందాడు. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన బండి తిరుపాలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. అతడు మంగళవారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్రవాహనంలోతన వ్యవ సాయ తోట వద్దకు వెళ్తున్నాడు. స్థానిక హెచ్చెల్సీ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో తాడిపత్రి రోడ్డు వైపు నుంచి అనంతపురం వస్తున్న మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బండి తిరుపాలును అనంతపురం సర్వజన అసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఢీ కొన్న ద్విచక్రవాహనదారులు ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులుగా గుర్తించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

హమాలీ ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూలై 23 : నగరంలోని రాణినగర్‌లో అప్పుల బాధతో ఓ హమాలీ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాణినగర్‌లో నివాసముంటున్న ఖాదర్‌బాషా(34) హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు రూ.3.50లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో పాటు ఒత్తిళ్లు అధికం కావడంతో మనస్తాపానికి గురై తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గ్రామదేవతలకు బోనాలు



వేపకుంటలో బోనాలను మోసుకొస్తున్న గ్రామస్థులు



ప్రత్యేక అలంకరణలో పోతలయ్యస్వామి

ధర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై23: మండలంలోని వేపకుంట గ్రామంలో మంగళవారం పోతలయ్యస్వామికి ఘనంగా బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువకులు బోనాలు ఎత్తుకుని వెళ్లి స్వామివారికి సమర్పించారు. అనంతరం పోతలయ్యస్వామికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు వర్ధిల్లాలని యేటా ఈ ఉత్సవం నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.

గంగమ్మ దేవతకు...

అనంతపురం క్లాక్‌టవర్: నగరంలోని చాకలి ఐలమ్మ కాలనీలో రజక కులస్థులు ఆషాఢమాస మంగళవారం పురస్కరించుకుని గంగమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీతో పాటు పాతూరులోని రజకులు ఉదయం నుంచి గంగమ్మకు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీ రజకవృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ... జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కరువు, కాటకాలు లేకుండా చూడాని యేటా అమ్మ వారికి బోనాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రజకులు పెద్ద ఎత్తున రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజకవృత్తి దారుల సమాఖ్య కార్యదర్శి హరికృష్ణ, నాయకులు లలిత, నాగప్ప, నాగరాజు, భూషణ, వీరాంజి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవతకు...

శింగనమల: వర్షాలు కురవాలని కోరుకుంటూ మండలంలోని సోదనపల్లిలో గ్రామస్థులు మంగళవారం పెద్దమ్మ దేవతకు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భగా ఉదయం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం గ్రామస్థులు మూగ జీవాలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఇలా అమ్మవరాకి పూజలు చేస్తే వర్షాలు వస్తాయనే నమ్మకమని గ్రామస్థులు తెలిపారు.



ఐలమ్మ కాలనీలో గంగమ్మదేవతకు బోనాలను సమర్పిస్తున్న మహిళలు

చీనీ కాయలు టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, జూలై 23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1255 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విద్యార్థుల సమస్యలపై దృష్టిపెట్టాలి



రిజిస్ట్రార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న తెలుగుయువత మండల అధ్యక్షుడు

అనంతపురంరూరల్, జూలై23: వర్శిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పట్ల దృష్టి సారించాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు అనిల్ చౌదరి ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబును కోరారు. ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయ నను అనిల్ చౌదరి శుక్రవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్కేయూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

ఎఫ్‌పీ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, జూలై23: జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఎఫ్‌పీ షాపుల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అందులో బాగంగా బుక్కరాయసముద్రంలోని రామతులసికి చెందిన చౌకధాన్యపు దుకాణాన్ని పరిశీలించారు. దీంతో రికార్డులకు, ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉండడంతో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

అనంతపురం న్యూటౌన్, జూలై23: పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారమని డాక్టర్ శ్రీరామ్‌కుమార్ పెర్కొన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం యాడికిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమం చేపట్టారు. అటవీ శాఖ యాడికి సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అటవీశాఖ సిబ్బంది వారి చేత మొక్కలు నాటించారు. వారు మాట్లాడుతూ... జిల్లాలో పచ్చదనం పెపొందించడానికి ఇంకా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ సూపర్‌వైజర్ గౌడ్, ఎఫ్‌టీఓ రామాంజినేయులు, మాధవి, ఏటీఓ చంద్రశేఖర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు పావని, చరణ్

రాప్తాడు, జూలై 23: పంగల్‌రోడ్డు సమీపంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చవుదుతున్న విద్యార్థులు పా వని, చరణ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మ జాదేవి, పీఈటీ మల్లికార్జున తెలిపా రు. స్థానిక ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఆ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. శ్రీకాకుళంలో ఆగస్టు నెల 17, 18 , 19వ తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పో టీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు పావని, చరణ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



శశిధర్ కుమార్

శింగనమల: మండలపరిధిలోని పెరవలి జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వి శశిధర్‌కుమార్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల కు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, పీడీ నరసింహారెడ్డి తెలిపారు. నగరంలోని ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాడన్నారు. విద్యార్థిని హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌పై సంబరాలు



మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

అనంతపురం అర్బన్ జూలై 23 : ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, కేంద్ర బడ్జెట్‌పై మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలో ఉన్న టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, కూచి హరి, డిష్ నాగరాజు, సంగా తేజస్విని, సుధాకర్ యాదవ్, పీఎం లక్ష్మీప్రసాద్, కాశీ విశ్వనాథ్, జోగి రాజేంద్ర, నెట్టెం బాలకృష్ణ, వన్నూరప్ప, రాయల్ రఘునాథ్ పాల్గొన్నారు.

రుణాలను వెంటనే చెల్లించండి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై23 : జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద రుణాలు పొందిన లబ్ధిదారులు వెంటనే చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. జిల్లాలో చాలా మంది లబ్ధిదారులు రుణాలు చెల్లించలేదన్నారు. లబ్ధిదారులు రుణాలను చెల్లించాలన్నారు. అదే విధంగా ఋణాలు పొందిన లబ్ధిదారులు ఎవరైనా మరణించి ఉంటే.. వారి వివరాలు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

జూలాకాల్వ ఘటనపై విచారణ చేస్తాం : ఎస్ఐ

శింగనమల, జూలై23: మండల పరిధిలోని జూలాకాల్వ గ్రామంలో యవకులను కట్టేసిన కొట్టిన విషయంపై విచారణ చేస్తామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. 'కట్టేసి కొట్టారు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అయన మంగళవారం మాట్లాడారు. యువకుల మధ్య జరిగిన ఘర్షణ తరువాత ఆదివారం రాత్రి సమయంలో శింగనమల, అనంతపురానికి చెందిన 30 మందిపైగా యువకులు జూలాకాల్వ గ్రామానికి వెళ్లి గొడవపడిన యువకులతో పాటు గొడవలకు ఎలాంటి సంబంధంలేని వారిపైనా మద్యం మత్తులో దాడులు చేస్తూ బీభత్సం సృష్టించారన్నారు. సమాచారం అందుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామని. అయితే గొడవపడే సమయంలో గ్రామస్థులు యువకులను కాడిమానుకు కట్టేసి కొట్టినట్లు ఆనావాళ్లు ఏవీ లేవన్నారు. అయితే కొన్ని వీడియోల్లో కాడిమానుకు కట్టేసి కొట్టినట్లు బయటికి రావడంతో ఆ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

జలధికి తరలిన పీర్లు

రామగిరి, జూలై 23: మండలంలో నసనకోట,శేషంపల్లి గ్రామాల్లో మంగళవారం పీర్లను ఘనంగా జలధికి తరలించారు. . సోమవారం రాత్రి పానకాలు మోసి చక్కెర చదివింపులు చేయించారు. అగ్నిగుండం వెలిగించి అలావ్ తొక్కారు. మంగళవారం సాయంత్రం జలధికి తరలించారు.

మహిళా క్రికెట్ పోటీల్లో గెలిచిన జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23: సీనియర్ మహిళల ప్రాబబుల్స్ క్రికెట్ పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో సీనియర్ మహిళల టీ20 క్రికెట్ ప్రాబబుల్స్ పోటీలు నిర్వహించారు. మొదట టీం - ఎ, టీం - బి జట్లు తలపడగా దీంతో టీ - ఎ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన టీం - ఎ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్ల కోల్పోయి 164పరుగులు చేసింది. ఇందులో మేఘన 70 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన టీం - బి 17.1ఓవర్లలో 98పరు గులకు ఆలౌట్ అయింది. శరణ్య 4 వికెట్లు తీసింది. టీం -సి, టీం -డి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టీం-సి నిర్ణీత 20ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసింది. ఇందులో రంగలక్ష్మి 94పరుగులు చేసింది. అనంతరం రంగంలోకి దిగిన టీం- డి జట్టు 20ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 102 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్య దర్శి మధు ఆచారి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మహిళా జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, సెలెక్టర్లు తులసిరామ్, లక్ష్మి, దివ్య, కోచ్‌లు విక్రమ్‌వర్మ, రమాదేవి, అనిత, మధురి, ప్రియాంక, గాంధి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

అధికారులు



సీకేపల్లి సచివాలయంలో ఆధార్ సేవలందిస్తున్న అధికారులు, సిబ్బంది

చెన్నేకొత్తపల్లి, జూలై 23: ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ అంకె అమరేంద్ర, అధికారులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గ్రామ సచివాలయం-1లో మంగళవారం అధికారులు ఆధార్ మొబైల్ క్యాంప్‌ను ప్రారంభించారు. సీకేపల్లి 1, 2, పులేటిపల్లి సచివాలయాల పరిధిలోని ప్రజలు హాజరై ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నారు. ఆధార్ లేని చిన్న పిల్లలకు కొత్తగా నమోదుచేశారు. మొబైల్ ఆధార్ వారోత్సవాలను ఈ నెల 27వ తేదీ వరకు మండలంలోని సచివాల యాల్లో నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు మంజునాథ్, నాగేంద్ర, టీడీపీ నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, ఏపీ శ్రీనివాసులు, ఈడిగ బార్గవగౌడ్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

శింగనమల: ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి వెంకటరమణ సూచించారు. మండలకేంద్రంలోని గ్రామ సచివాలయంలో మంగళవారం ఆధార్ క్యాంపును ప్రారంభించారు. శింగనమల, తరిమెల సచివాలయాల్లో గురువారం వరకు క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఈ నెల 26 , 27వ తేదీల్లో వెస్టు నరసాపురం, పెరవలి జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డాక్టర్స్ క్వార్టర్స్‌ను పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్



డాక్టర్స్ క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జూలై 23: ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టర్ మంగళవారం సాయంత్రం నగరంలోని జీసస్ నగర్ వద్ద ఉన్న డాక్టర్స్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్వార్టర్స్‌లో పారిశుధ్యం మరింత పెంచాలన్నారు. ఇక్కడి డ్రైనేజీని ప్రధాన డ్రైనేజీలోకి కలిపేలా చూడాలన్నారు. డాక్టర్స్ క్వార్టర్స్‌లోకి ఇతరులు ఎవ్వరూ రాకుండా చూసుకోవాలన్నారు. ప్రధాన గేటు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. క్వార్టర్స్‌లో అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు, డాక్టర్లు పాల్గొన్నారు.

మా సమస్యలను పరిష్కరించండి

రాష్ట్ర వైద్య శాఖ మంత్రికి ఎంపీఈఓల వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 23 : వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు శంకర్, భాస్కర్ నాయక్ మంగళవారం విజయవాడలోని ఏపీ సచివాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రతి 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించాల, చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న జిల్లాకు చెందిన ఎంపీఈఓలకు తిరిగి అనంతలోనే పోస్టింగ్‌లు ఇప్పించాలన్నారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్బీకే సిబ్బంది తరహాలోనే సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.


'ద్వారకనాథ్‌రెడ్డి క్రీడాకారులకు ఆదర్శం'



ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న దరూర్ అకాడమీ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23: అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ద్వారకనాథ్ రెడ్డి క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని పలువురు సీనియర్ క్రీడాకారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాపోటీల్లో భారత్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా క్రీడాకారుడు ద్వారకనాథ్‌రెడ్డిని మంగళవారం స్థానిక రామ్‌నగర్‌లోని దరూర్ స్విమ్మింగ్ అకాడమి లైఫ్ స్టూడియోలో ఘనంగా సన్మానించారు. దరూర్ స్విమ్మింగ్ అకాడమి లైఫ్ స్టూడియో నిర్వాహకులు దరూర్ ఓబుళనాయుడు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేంద్రచౌదరి, ఏజీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజ్, టీడీపీ నాయకులు రాఘవేంద్రచౌదరి, ద్వారకనాథ్‌రెడ్డి తండ్రి హరినాథ్‌రెడ్డి, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ విజేతలకు ఆర్డీటీ అభినందనలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23 : జాతీయ స్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాలు సాధించిన క్రీడాకారులను ఆర్డీటీ ఆధ్వర్యంలో అభినందించారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన 13వ జాతీయ జూనియర్-సబ్‌జూనియర్ పారా అథ్లెటిక్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో నరేష్ స్వర్ణం, షాట్‌పుట్‌లో సుదర్శన్ రజతం, భార్గవకుమార్ కాంస్య పతకాలు సాధించారు. వారిని నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాం చో ఫెర్రర్ అభినందించారు. శాప్‌కోచ్ మంజుల, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, ఆర్డీటీ కోచ్ బాలకృష్ణ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య, జూలై 23 : ప్రభుత్వ బీసీ, ఎస్సీ , ఎస్టీ మైనార్టీ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ వద్ద ఉన్న బీసీ, ఎస్సీ హాస్టళ్లను మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయిస్వరూప తదితరులు పాల్గొన్నారు.



వైర్లను కత్తిరించిన దృశ్యం

మోటార్లు మాయం

కాంట్రాక్టు సిబ్బంది ప్రమేయంపై అనుమానాలు



మూడు మోటార్లు ఉండాల్సిన చోట.. ఇలా రెండు మోటార్లే..

ఉరవకొండ, జూలై 23: మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ఎస్ స్కీంకు సంబంధించిన మోటార్లు మాయమయ్యాయి. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సమీపంలో నీటి పంపింగ్‌కు సంబంధించిన మూడు గదులలో ఎనిమిది మోటార్లు ఉండాల్సి ఉండగా ఆరు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రెండు ఎక్కడికి పోయాయో అధికారులకు అంతుచిక్కడం లేదు. పంప్‌హౌస్ గదులలోని 25హెచ్‌పీ మోటార్లు, 30హెచ్‌పీ మోటారు ఒకటి కనిపించడం లేదు. మోటార్ల విలువ సుమారు రూ.1.5లక్షల దాకా ఉంటుంది. మోటార్ల మాయం వెనుక గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం నిర్వహణకు సంబంధించిన వైసీపీకి అనుకూలమైన కాంట్రాక్టర్, సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ మోటారు తీసుకెళ్తున్న సమయంలోనూ కొంత మంది సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. నీటి పంప్‌హౌస్‌లోని ఫ్యూజు వైర్లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన వైర్లను కూడా కత్తిరించి ఎత్తుకెళ్లారు. వీటి విలువ కూడా రూ.లక్షలకు పైమాటే. అధికారులు కాంట్రాక్టర్‌కు వత్తాసు పలకడం వల్లనే, ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోటార్లు లేని విషయం తమ దృష్టికి వచ్చిందని విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.

సంతసం ఏదీ?

మార్కెట్‌లో మాయ !

- ఈనామ్ విధానంతో రైతులకు నష్టాలు
- వేలం పూర్తి అయినా తెలియని ధర
- ట్రేడర్లు నిర్ణయించిన మేరకే...
- మార్కెట్ యంత్రాంగం పర్యవేక్షణ కరువు
- అనంత సంతలో చితికిపోతున్న చీనీ రైతు



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురంరూరల్, జూలై 23: పంట బాగా పండిందన్న సంబరంతో దిగుబడిని మార్కెట్‌కు తీసుకువస్తే, ఇక్కడ ధర ఎంత పలికిందో తెలియక రైతులు తికమక పడుతున్నారు. మాయా మార్కెట్‌తో నిలువునా మునిగిపోతున్నారు. ఆన్‌లైన్ విధానంలో ట్రేడర్లు రైతులకు పంగనామాలు పెడుతున్నారు. మార్కెట్‌లో వారు నిర్ణయించిందే ధర. ఈక్రమంలో అందినకాడికి రైతులను దోచుకుంటున్నారు. మార్కెట్ యంత్రాంగం పర్యవేక్షణ గాడి తప్పడంతో ట్రేడర్లు చెప్పిదానికి సిబ్బంది తలూపుతున్నారు. దీంతో రైతులకు పంట పండినా నష్టాలు తప్పడం లేదు. ఇదీ అనంతపురం మార్కెట్‌లో చీనీ రైతులు దుస్థితి.

ఆన్‌లైన్ విధానంతో రైతులకు పంగనామాలు..

ఆన్‌లైన్ విధానంలో రైతులకు ట్రేడర్లు పంగనామాలు పెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ విధానంలో ట్రేడర్లు ముందుగానే తమకు కావాల్సిన దిగుబడి రకాన్ని ఎన్నుకుని రేటు కడుతున్నారన్న వాదనలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. వ్యాపారులతో ముందుగానే మాట్లాడుకుని వేలంలోకి దిగుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ట్రేడర్లు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేట్లను ఫలానా లాట్ ఇంతే కోడ్ చేయాలి. ఈరోజు ఇంతే ధర ఉండాలని నిర్ణయించి వేలంలో పాల్గొంటున్నట్లు విమర్శలున్నాయి. బహిరంగ వేలం కాకపోవడంతో వేలం పూర్తి అయ్యే వరకు తమ దిగుబడులు ఎంత ధరకు అమ్ముడుపోయాయో రైతులకు తెలియడం లేదు. ఒక వేళ ధర నచ్చక సరుకు వెనక్కు తీసువెళాదామంటే పచ్చి సరుకు కావడంతో వెళ్లలేని పరిస్థితి. దీంతో ట్రేడర్లు కట్టిందే ధరగా మారింది. ఆ రేటుకు తమ పంటను విక్రయించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. కాగా ఒక వేళ ఎవరైనా కొంత రేటు ఎక్కువ వేశారంటే ఇతర ట్రేడర్లు అందరూ ఆ ట్రేడర్‌పైకి ధ్వజమెత్తునట్లు తెలుస్తోంది. సోమవారం జరిగిన ఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఓ రైతుకు ఓ ట్రేడరు టన్ను రూ.18వేలతో కట్టించాడు. అలాంటి కాయలకే మరో ట్రేడర్ రూ.15వేలతో కట్టించాడు. దీంతో తక్కువ ధర పలికిన రైతు ట్రేడర్‌తో గొడవకు దిగాడు. ఈక్రమంలోనే వ్యవహారం రోడ్డుపై బైఠాయించి నిరసనకు దారితీసింది. ఈక్రమంలోనే సదరు ట్రేడర్ల మధ్య వాదనలు జరిగినట్లు తెలుస్తోంది.

లోపించిన పర్యవేక్షణ

మార్కెట్‌లో అధికార యంత్రాంగం పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు ఆయా వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. ఇన్ని టన్నులు చీనీకాయలు మార్కెట్‌కు వచ్చాయి. వీటి ద్వారా మార్కెట్‌కు పన్నురూపంలో ఇంత ఆదాయం వచ్చిందని చెప్పుకోవడంతోనే అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో రైతులకు లాభం జరుగుతోందా? నష్టం జరుగుతోందా? అన్న విషయాల గురించి యంత్రాంగం పట్టించుకో వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ధర ఎంతో రైతులకు తెలియని దుస్థితి..

మార్కెట్‌లో ఈ-నామ్ విధానంలో చీనీ వేలం జరుగుతోంది. ఇది రైతులకు ఏవిధంగా మేలు జరుగుతుందో తెలియని పరిస్థితి. రైతులు మార్కెట్‌కు చీనీ కాయలను తీసుకురావడం. అతరువాత మార్కెట్ సిబ్బంది రైతుల వివరాలు, ఎంత దిగుబడి మార్కెట్‌కు తీసుకువచ్చారు? వంటివి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తరువాత వేలం నిర్వహిస్తున్నారు. మార్కెట్‌లోని ట్రేడర్లు నిర్ణయించిన ధరను మార్కెట్ సిబ్బంది రైతులకు తెలియజేస్తున్నారు. ఈప్రక్రియ అంతా ముగిసేసరికి రెండు మూడు గంటలు సమయం పడుతోంది. దీంతో రైతులకు తమ దిగుబడులు ఎంత ధర పలికాయో అంత వరకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ విధానంలో రైతులకు ఏమేలు జరిగుతుందో సంబంధిత అధికారులకే తెలియాలి. బహిరంగ వేలం నిర్వహిస్తే తమ దిగుబడులు ఎంత ధర పలుకుతున్నాయో రైతులకు స్పాట్‌లో తెలిసే వీలుంటుంది. ఈక్రమంలోనే ఆ ధరకు రైతు తమ దిగుబడులు ఇవ్వాలనుకుంటే ఇస్తాడూ, లేదంటే మరొకరికి విక్రయించుకునే వీలుంటుంది. ఆ విధంగా వేలం జరిగితే తమకు లాభ నష్టాలు తెలుస్తాయని రైతులు అంటున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఇవేవీ తెలియకపోవడంతో ట్రేడర్లు నిర్ణయించిన ధరకు తమ దిగుబడులను అమ్ముకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఒక్కరోజులోనే తగ్గించేశారు



ధర బాగుందని టన్నుకు పైగా కాయలను మార్కెట్‌కు తీసుకొచ్చా. టన్ను రూ.13వేలతో అమ్ముడుపోయాయి. నిన్నటి రోజునా ఇలాంటి కాయలే రూ.18వేలతో అమ్ముడుపోయాయి. ఒక్కరోజులోనే రేటు తగ్గించేశారు. మార్కెట్‌కు వచ్చేటప్పుడు కల్లూరు వద్ద రూ.16,500తో అడిగారు. ఇవ్వకుండా వచ్చినందుకు లాభం కంటే నష్టమే మిగిగింది.

- వెంకటేష్ నాయక్, రైతు పాళ్యంతండా, పామిడి మండలం

ఏమీ తెలియడంలేదు



మార్కెట్‌కు ఆరు టన్నులకు పైగా కాయలు తీసుకొచ్చా. ఆన్‌లైన్‌లో వేలం వేశారంటా. వేలం వేసి రెండు గంటలు(10.30గంటల సమయంలో) గడిచిపోయాయి. ఇంత వరకు ఎంత ధర పలికిందో తెలియడం లేదు. ఎంత రేటు కట్టారో ఎవరూ చెప్పడం లేదు. బహిరంగ వేలం నిర్వహిస్తే కనీసం ధరైనా తెలిసేదీ. ఆన్‌లైన్ విధానంతో ఏమీ తెలియడం లేదు.

- పక్కీరప్ప, రైతు, నాగలూరు, బత్తలపల్లి మండలం



ఎంపికైన జిల్లా సాఫ్ట్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్లు



ఎంపికైన జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్లు

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23: జిల్లా సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీటీ స్టేడియంలో జిల్లా జూనియర్, సీనియర్ బాల, బాలికల క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు ప్రకటించారు.

సీనియర్ బాలుర జట్టు: మహేష్, వరుణ్‌కుమార్, అక్షయ్‌సాగర్, పృథ్వీరాజ్, శివకుమార్, సింహాద్రి, లక్ష్మీనారాయణ, వినోద్, లక్ష్మీకళ్యాణ్, తరుణ్‌సాయి, సుశాంత్, అరవింద్, ధనుష్, అబ్దుల్‌ఖాదర్, షాకీర్, నవీన్‌కుమార్.

సీనియర్ బాలికల జట్టు: లావణ్య, లక్ష్మీ, స్రవంతి, ధరణి, ఖ్యాతి, గౌరీ, మౌనిక, శిరీష, అమీదా, బసంతి, ఫాతిమా, నాగప్రసన్న, సుకన్య, నిహారిక, ప్రశాంతి, జ్యోతి.

జూనియర్ బాలికల జట్టు: చంద్రకళ, సరోజా, ఆశా, లక్ష్మీ, శ్రావణి, శృతి, పల్లవి, హాసిని, మానీ, ఉష, పల్లవి, సుజన్, రోహిణి, సుప్రియ, జాహ్నవి, చంద్రిక, నిఖి.

జూనియర్ బాలుర జట్టు: అరవింద్ రెడ్డి, చరణ్‌తేజ్, గణేష్, వసంత్‌కుమార్, సాయివెంకట్, అజయ్, చరణ్, జగదీష్, హేమచంద్ర, సురేష్, నాని, శశిధర్ కుమార్, మున్నా, సతీష్, మోక్షిత్‌వర్మ, భానుశంకర్. ఎంపికైన సీనియర్ జట్లు ఆగస్టు 10 నుంచి వినుకొండలో, జూనియర్ జట్లు ఆగస్టు 17 నుంచి శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, పీడీలు రామకృష్ణ, ప్రభాకర్, గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవులు, చంద్ర, లతాదేవి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకునేదెవరు?

మోడల్ స్కూళ్లలో ఇష్టారాజ్యం...!

- కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలేవీ?
- తనిఖీలు మర్చిపోయిన విద్యాశాఖ అధికారులు
- నేటికీ స్పందించని ఏడీ నాగరాజు



కణేకల్లు మోడల్ స్కూల్

అనంతపురం విద్య, జూలై 23: జిల్లా మోడల్ స్కూళ్లను గాలికి వదిలేసినట్లు అనిపిస్తోంది. ప్రిన్సిపాల్ నెలల తరబడి స్కూళ్లకు వెళ్లకున్నా..పట్టించుకునవారు లేరు. కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణ నెలల తరబడి స్కూల్‌కు దుమ్మా కొట్టారు. స్కూల్ నిర్వహణను గాలికి వదిలేశారు. ఆయన స్కూల్‌కు వెళ్లకున్నా...అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు ఉంటున్నాయి. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో పెద్దసార్ యాడున్నాడో ...? శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే ఇంత వరకూ ఆ ప్రిన్సిపాల్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. చర్యలు తీసుకోకపోగా...ఆయనకు సపోర్ట్ చేసిన మరో సీనియర్ పీజీటీకి మళ్లీ ఇప్పుడు పట్టం కట్టాలని చూస్తున్నట్లు సమాచారం. మొత్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్కూళ్ల తనిఖీలనే మరిచిపోయారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.





జూన్, జూలై నెలల్లో సంతకాలు చేయని ప్రిన్సిపాల్

దొంగల చేతికే తాళాలు...

కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆయన గత కొంత కాలంగా మోడల్ స్కూల్‌కు రావడం లేదు. జూన్, జూలై మాసాల్లో ఆయన స్కూల్‌లోనే అడుగు పెట్టలేదు. అయినా జీతం మాత్రం డ్రా చేస్తున్నారు. ఆయన స్కూల్‌కు రాకున్నా ఆయన తరపున మరో సీనియర్ పీజీటీ సంతకాలు చేశారు. స్కూల్‌కు రాకుండా బయట తిరుగుతున్న ప్రిన్సిపాల్‌కు సీనియర్ పీజీటీ అన్ని రకాలుగా సహకరిస్తున్నట్టు సమాచారం. విధులకు దుమ్మా కొట్టే ప్రిన్సిపాల్‌కు మరొకరు సహకరిస్తుండటంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఏకంగా సంతకాల ఫోర్జరీ వ్యవహారం స్కూల్‌లో సాగుతోంది. అయితే ఇంత వరకూ ప్రిన్సిపాల్‌పై చర్యలు లేవు. ప్రిన్సిపాల్ వైఖరిపై తీవ్ర విమర్శలు వస్తుంటే...ఆయనకు సహకరించిన సీనియర్ పీజీటీకి ఇప్పుడు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని విద్యాశాఖ అధికారులు చూస్తున్నట్టు తెలుస్తోంది.

నిద్ర మత్తులో అధికారులు

జిల్లా వ్యాప్తంగా 15 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 6000 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిని ఏడీ నాగరాజు పర్యవేక్షిస్తున్నారు. అయితే ఆయన బాధ్యతలను పూర్తిగా గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. కణేకల్లు స్కూల్‌లో ప్రిన్సిపాల్ నెలల తరబడి హాజరుకాకున్నా గుర్తించలేదంటే ఏడీ పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. గతంలో జిల్లాకు వచ్చిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మోడల్ స్కూల్ ఏడీ తీరుపై ఫైర్ అయ్యారు. అయినా ఆయనలో మార్పు కనిపించడంలేదు. అటు విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం మోడల్ స్కూళ్ల పర్యవేక్షణను గాలికి వదిలేయడంపై అనేక విమర్శలు వస్తున్నాయి.

రాక్రీట్ అక్రమాలపై విచారణ జరిపించండి

- ఇళ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి
- పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభించండి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి



సీఎం చంద్రబాబునాయుడును కలిసి వివరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన రాక్రీట్ సంస్థపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథిని కలిశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పేరుతో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి సంబంధించిన సంస్థ కాంట్రాక్ట్ తీసుకుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే రూ.200 కోట్లు డబ్బులు కాజేశారన్నారు. రాష్ట్రంలో మొత్తం 3.15 లక్షల జగనన్న ఇళ్లల్లో 63 వేలు రాక్రీట్ సంస్థకే కేటాయించినట్లు వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం, వైఎస్ఆర్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని గృహనిర్మాణ పనులను రాక్రీట్‌కు అప్పగించారని ఆమె తెలిపారు.

టెండర్లే లేవు

నిబంధనల మేరకు రూ.పది లక్షలకు మించిన పనులకు టెండరు విధానాన్ని పాటించాల్సి ఉంది. అయితే రాక్రీట్ సంస్థకు ఇళ్లను కేటాయించే విషయం ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోలేదని ఆమె ఫిర్యాదు చేశారు. రూ.1,100 కోట్ల విలువైన పేదల ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బంధువు, అనుచరవర్గం డైరెక్టర్లుగా ఉన్న రాక్రీట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి కట్టబెట్టారన్నారు. తీసుకున్న పనులను కూడా సక్రమంగా చేయలేదన్నారు. ఇసుక, సిమెంటు, ఐరన్ పేరుతో పెద్ద ఎత్తున నిధుల దోపిడీ జరిగిందన్నారు. కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించ కుండా బిల్లులు కాజేసినట్లు ఆరోపించారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయించాలని మంత్రిని కోరారు. ఈ విషయంపై గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి తీవ్రంగా స్పందించి అక్కడే సమావేశంలో ఉన్న హౌసింగ్ సెక్రటరీతో మాట్లాడి అన్ని వివరాలు సమగ్రంగా అందించాలని ఆదేశించారు.

అప్పర్ పెన్నార్ పనులు మళ్లీ ప్రారంభించాలి

రామగిరి మండలంలోని అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టుకు నీరందించే పనులు మళ్లీ ప్రారంభించాలన్నారు. 2018లో రూ.804 కోట్లతో పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టుకు 53 కి.మీ మేర కాలువ తవ్వి హంద్రీనీవా నుంచి నీరు అందించాలని ప్రతిపాదించామన్నారు. అప్పట్లో నిధులు కేటాయింపులు కూడా జరిగినట్లు పరిటాల సునీత వివరించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని పూర్తిగా వదిలేశారన్నారు. పైగా పుట్టకనుమ రిజర్వాయర్‌ను రద్దు చేసి ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లను తీసుకొచ్చారన్నారు. పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించి పేరూరుకు నీరందిస్తామని తాము ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చినట్లు వివరించారు. వెంటనే ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

పేరూరు ప్రాజెక్టుకు నిధులివ్వండి

పేరూరు ప్రాజెక్టు నిర్వహణకు నిధులు కేటాయించాలని కూడా ముఖ్యమంత్రి, జలవనరుల శాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లల్లో పేరూరు ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేక అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టును పరిశీలించి మరమ్మతులకు రూ. 1.26 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారన్నారు. 5, 8 గేట్లు పూర్తిగా విరిగిపోయాయన్నారు. రామగిరి మండలం నసనకోటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ వరకూ ఉన్నతీకరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఆ శాఖ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. అన్ని అంశాలు పరిశీలించి వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్‌కు అవకాశం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సమష్టిగా పనిచేద్దాం

ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, జూలై 23: సంస్థ కోసం సమష్టిగా పనిచేద్దామని ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనమంతా ఒక కుటుంబ సభ్యులమని, సంస్థ కన్నతల్లిలాంటిందని, సంస్థను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంస్థలోని అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించా లన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవాలందిచాలని సూచించారు. ఎవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తేవాలన్నారు.



విద్యుత్ శాఖ ఎస్ఈకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఉద్యోగులు

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 23: వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విభిన్న ప్రతిభావంతులు కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాల ని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు www.awards.gov.in లేదా www.depwd.gov.in వెబ్‌సైట్‌లలో పొందుపరిచిన సామాజిక సేవా కార్యక్రమాలను ఎంపిక చేసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

టమోటా కిలో రూ.53

అనంతపురం రూరల్, జూలై 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.15 పలికినట్లు ఆయన తెలిపారు.

పెండింగ్ డబ్బులు త్వరలో జమ

జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు

అనంతపురం అర్బన్, జూలై 23: వాహన యజమానులకు పెండింగ్ డబ్బులను త్వరలోనే జమ చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి వీర్రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల వరకు రెవెన్యూ శాఖకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి రూ.2.08 కోట్లను ఆయా వాహనదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఎన్నికల తర్వాత రెవెన్యూ, పోలీసు శాఖలకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఇంకా రూ.33 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. ఎన్నికల ముందు వరకు పోలీసు శాఖకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఇది వరకే రూ.36 లక్షలు జమైందన్నారు. వివిధ నియోజకవర్గాల్లో పోలీసులకు ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.28 లక్షలు జమ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంలో వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పెండింగ్‌లోని డబ్బులు జమ చేసేలా చూస్తామన్నారు. ఇంకా ఏమైనా సందేహాలుంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: ఎస్టీయూ



డీడీతో మాట్లాడుతున్న ఎస్టీయూ నేతలు

అనంతపురం విద్య, జూలై 23: ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఏపీజీఎల్ఐ డీడీ భాస్కర్ తేజనాథ్‌ను కోరారు. సంగమేష్ నగర్ సమీపంలోని కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిశారు. ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు ఉద్యోగులకు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రుణాలు, మిస్సింగ్స్ క్రెడిట్స్, ఇప్పటికే దరకాస్తు చేసిన అన్ని బాండ్ల క్లెయిమ్స్‌ను కూడా వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. నాయకుల డిమాండ్లపై ఆయన సానుకూలంగా స్పందించారు. తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, రాష్ట్ర అదనపు కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణ మోహన్, ఫణిభూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు నాగభూషణ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

గుంతకల్లు టౌన్, జూలై23: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం పరిశీలించారు. క్యాంటీన్‌లో శ్లాబ్, పెయింటింగ్ పనులు ఎంత వరకు వచ్చాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా చేయించాలని సూచించారు. ఆగస్టు 15న ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ గుర్రప్ప యాదవ్, ఏఈలు, పాల్గొన్నారు.

భర్తపై భార్య దాడి

తాడిపత్రి, జూలై23: మండలంలోని చిన్నపొలమడ గ్రామానికి చెందిన రంగడుపై భార్య రేవతి, మరో వ్యక్తి ధర్మ కలిసి రాళ్లతో దాడిచేసి గాయపరిచారని రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. రంగడు చెవిటి, మూగవాడు కాగా కూలీ పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. రేవతి కొంతకాలం నుంచి ధర్మతో చనువుగా ఉంటోంది. అయితే మంగళవారం రంగడు పనికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉన్నాడు. దీంతో వారిద్దరూ కలిసి అతడిపై రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తల్లి పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

వీఆర్వో ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్,జూలై23: పట్టణంలోని సోనియా గాంధీ కాలనీలో నివాసముంటున్న వీఆర్వో మాధవి ఇంట్లో మంగళవారం సాయంత్రం చోరీ జరిగింది. 13వ సచివాలయంలో మాధవి వీఆర్వోగా విధులు నిర్వహిస్తోంది. ఉదయం ఇంటికి తాళం వేసి అనంతపురానికి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఉంగరాలు, ఒక జత వెండి పట్టీలు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితురాలు వాపోయింది. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మాధవి తెలిపింది.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్,జూలై23: గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, సబ్ డివిజన్ లెవల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ నూతన కమిటీకి ఎస్సీఎస్టీ సోషల్ సర్వీస్ అనుభవం, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీఎస్టీ చట్టాలపైన అవగాహన కలిగిన ఎస్సీఎస్టీ అభ్యర్థులు ఆగస్టు 6తేదీలోపు గుంతకల్లు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

కూడేరు, జూలై 23: మండలంలోని కలగళ్లలో స్వాతి (30) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కలగళ్ల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, స్వాతి దంపతులు. ఎర్రిస్వామి రోజులాగే మంగళవారమూ గాలిమరల పనికి వెళ్లాడు. కాగా మధ్యాహ్న సమయంలో స్వాతి ఇంట్లో ఎవరూ లేనిది చూసి విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను బంధువులు గమనించి వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియా ల్సి ఉంది. ఇంకా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా జనార్దన్

ఉరవకొండ,జూలై23: ఏపీ వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా హావళిగికి చెందిన జనార్దన్ నియమితులైయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు విక్రమనాయుడు నుంచి నియమక ఉత్తర్వులు అందుకున్నట్లు మంగళవారం ఆయన ప్రకటనలో తెలిపారు. వాల్మీకి, బోయల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గుత్తి, జూలై23: వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబల కుండా, దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు మంగళవారం చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో నీరు నిల్వ ఉన్న కుంటలు, బావులలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు లార్వాను ఆహారంగా తీసుకునే గంబూషియా చేపలను వదిలామన్నారు. వీటి వల్ల దోమలను వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మండల మెడికల్ సబ్‌యూనిట్ అధికారి వినయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నెట్టికల్లు, ఆర్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

ఉరవకొండ, జూలై23: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని మహాత్మా జ్యోతీరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు సుధాకర్, నాగేంద్ర మంగళ వారం సందర్శించారు. పాఠశాల ఆవరణలో నిర్మాణం ఆగిపోయిన జూనియర్ కళాశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ పాలన విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ఆగిపోయిన భవనాల విషయాన్ని మంత్రి కేశవ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోనాథ్, నాయకులు నారాయణస్వామి, మండి ఎర్రిస్వామి, నాగన్న పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్, జూలై23: పట్టణానికి చెందిన ఆ నలుగురు సేవా సమితి సభ్యులు మంగళవారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం బళ్లారి రోడ్డులోని హంద్రీనీవా కాలువ సమీపంలో 70 ఏళ్ల వయసు గల వృద్ధుడు మృతిచెందాడన్నారు. వజ్రకరూరు పోలీసులు తమకు సమాచారం అందించారన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆ మృతదేహానికి పాతగుంతకల్లులోని హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు శ్రీధర్‌రెడ్డి, ప్రదీప్‌ఆచారి, కృష్ణమూర్తి, ప్రవీణ్, అంజి, రాజప్ప, ఆటో వేణు, కానిస్టేబుల్ రామాంజినేయులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్ధారణపై స్పెషల్ డ్రైవ్

బ్రహ్మసముద్రం, జూలై 23: కుష్ఠు నిర్ధారణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జిల్లా వైద్యాధికారుల బృందం మండలంలోని మామడూరు గ్రామంలో పర్యటించారు. కుష్ఠు నిర్ధారణకు సర్వే ఎలా చేస్తున్నారని ఆశా కార్యకర్తలను, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలను అడిగి తెలుసుకున్నారు. సర్వే రిపోర్టులు తనిఖీ చేశారు. గ్రామంలోని అన్ని ఇళ్లను సందర్శించి ఎవరికైనా శరీరంపై రాగిరంగు మచ్చలు స్పర్శ లేకుండా ఉంటే గుర్తించి వెంటనే సమీప ఆస్పత్రికి పంపాలని సూచించారు. ప్రతి రోజు సర్వే చేసిన రిపోర్టును ఆన్‌లైన్‌లో పేర్లతో సహా నమోదు చేయాలని తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గంగాధర రెడ్డి, డాక్టర్ రాజేష్‌కుమార్, హెచ్ఈవో సత్యనారాయణ, ఆంజనేయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మూడేళ్ల క్రితం కూలిపోయిన షెట్టర్, వంతెన



రాకెట్ల వద్ద కూలిపోయిన వంతెన



దెబ్బతిన్న ప్రధానకాలువ

పీఏబీఆర్ కాలువలో నీరు పారేది ప్రశ్నార్థకమే

- శిథిలావస్థలో కాలువ
- ఏపుగా పెరిగిన కంపచెట్లు, అడ్డుగా రాళ్లు
- మూడేళ్ల క్రితం కూలిన షట్టర్, వంతెనలు
- ఆధునికీకరణను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

ఉరవకొండ, జూలై23: ఉమ్మడి అనంతపురం జిల్లాకు తాగు, సాగు నీరు అందించే పీఏబీఆర్ లింకు కెనాల్ పట్ల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికే హెచ్ఎల్‌సీకి నీళ్లు వదిలారు. మరో రెండు రోజుల్లో లింక్ కెనాల్‌కు నీళ్లు రానున్నాయి. అయితే ఆ కాలువలో నీరు పారేందుకు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. కాలువలో ఎక్కడపడితే అక్కడ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. రాళ్లు అడ్డంగా పడి ఉన్నాయి. దీంతో అందులో నీరు పారేది ప్రశ్నార్థకంగా మారింది.

మండలంలోని మోపిడి గ్రామ సమీపంలో హెచ్చెల్సీ అనుబంధంగా పీఏబీఆర్ కాలువను 1600 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించారు. కాలువ 11 కిలో మీ టర్ల మేర ఉంటుంది. అయితే కాలువ లైనింగ్ పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 500 క్యూసెక్కులు మించి నీరు పారలేని పరిస్థితి ఏర్పడింది. కాలువ ప్రారంభమయ్యే చోట షట్టర్, వంతెన కూలిపోయాయి. షట్టర్ లేకపోవడం వల్ల నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వంతెన కూలిపోవడంతో కాలువ మీద రాకపోకలు స్తంభించిపోయాయి. రాకెట్ల వద్ద అండర్ టన్నెల్ కాలువ అధ్వానంగా తయారైంది. రాకెట్ల సమీపంలోని 6.9కి.మీ వద్ద వంతెన కూలిపోయింది. దీంతో రైతులు దానిపై మట్టి వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గత మూడేళ్లుగా ఈ దుస్థితి ఉన్నా అప్పటి వైసీపీ ప్రభుత్వం వీటి మరమ్మతుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. జిల్లాలోని అనంతపురం నగరంతో పాటు 1800గ్రామాలకు పీఏబీఆర్ నుంచి తాగునీటి సరఫరా కొనసాగుతోంది. దీంతో పాటు కుడి కాలువ ద్వారా 42చెరువులకు నీరు అందనుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పీఏబీఆర్ లింక్ కెనాల్ ఆధునీకరణ పనులు పూర్తిచేసి నిర్దేశించిన మేరకు 1600క్యూసెక్కుల నీరు పీఏబీఆర్ జలాశయానికి తరలించాల్సి ఉంది. టీడీపీ ప్రభుత్వంలోనైనా ఈ కాలువకు మహర్దశ పట్టేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలకే పరిమితం

కాలువ ఆధునికీకరణ కలగానే మిగిలింది. మూడేళ్ల కిందట మరమ్మతులకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దాన్ని అప్పటి వైసీపీ ప్రభుత్వం పరిశీలించి రూ.64కోట్లకు కుదించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఈ కాలువను పట్టించుకున్న దాఖలాలేవు. నిధులు కూడా కేటాయించలేదు.

నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు

కాలువలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. రెండ్రోజుల్లో పనులు చేపడతాం. కూలిపోయిన వంతెనలు పూర్తిగా తొలగిస్తాం. ఇప్పటికే 10వ కి.మీ వద్ద పనులు చేపట్టాం.

- విశ్వనాథ్, డీఈఈ, పీఏబీఆర్

ఘనంగా పామిడమ్మ తిరునాళ్ల

పామిడి, జూలై 23: పట్టణంలో మంగళవారం గ్రామదేవత పామిడమ్మ అమ్మవారి తిరునాళ్ల ఘనంగా జరిగింది. ఆలయంలో అర్చకులు వేకువజామునే అమ్మవారికి అలంకరణలు, విశేష పూజలు చేపట్టారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో అమ్మవారి తిరునాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ అమ్మవారిని దర్శించి పూజలు చేయించారు.



పామిడమ్మ మూలవిరాట్

రేణుకా ఎల్లమ్మకు బోనాలు

గుత్తి,జూలై 23: పట్టణంలోని కోట వీధిలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, గంగా పూజ, వడి బియ్యం, విశేష పూజలు చేపట్టారు. అనంతరం కోట వాకిలి వద్ద నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ అమ్మవారిని దర్శించుకున్నాంనను. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాడిపత్రి, జూలై 23: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామ సమీపంలో వెలసిన యర్రగుడి గంగమ్మతల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

ఘనంగా కుంటెమ్మ జాతర

యాడికి, జూలై 23: మండలకేంద్రంలోని అంబేద్కర్‌కాలనీలో కుంటెమ్మజాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసి పూజలు జరిపారు. మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

అంబాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు

యాడికి, జూలై 23: ఆషాఢ మాసం సందర్భంగా మండలకేంద్రంలోని అంబాభవాని ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవాలని కోరుతూ పూజలు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

గుత్తి, జూలై 23: గుత్తి ఆర్ఎస్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.

యాడికి: మండలకేంద్రంలోని మూలపెద్దమ్మ తలి శాకాంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా మూల పెద్దమ్మ ఆలయంలో అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



యాడికిలో శాకంబరి అలంకరణలో మూలపెద్దమ్మ అమ్మవారు

మస్తానయ్య స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లు టౌన్, జూలై 23: పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. వక్ఫ్‌బోర్డు అధికారుల ఆధ్వర్యంలో దర్గాలోని 10 హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఒక సంవత్సరం పాటు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. లెక్కింపు రాత్రి వరకు కొనసాగుతుందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్ తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రామసుబ్బారెడ్డి, ఎల్లార్తి దర్గా ఈఓ ఇమ్రాన్, వీఆర్వోలు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

తాడిపత్రి, జూలై23: పట్టణంలోని గాంధీసర్కిల్, కూరగాయల మార్కెట్, బస్టాండ్, మెయిన్‌బజారులో మంగళవారం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు వంద మంది సభ్యత్వాన్ని తీసుకున్నారని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాలవేములలో జలధికి తరలిన పీర్లు

పుట్లూరు, జూలై 23: మండలంలోని చాలవేముల గ్రామంలో మొహరం వేడుకల్లో భాగంగా మంగళవారం పీర్లు జలధికి వెళ్లాయి. ఈ సందర్భంగా ముజావర్లు ఉదయమే పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం మరోసారి అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు. అంతకుమునుపు భక్తులు పెద్దఎత్తున చక్కెర చదివింపులు చేయించారు.

పొదుపు సంఘాలను వినియోగించుకోవాలి

తాడిపత్రి, జూలై 23: మహిళలు పొదుపు సంఘాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని ఏరియా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో మంగళవారం ఆమె పొదుపు సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు సూచనలు చేశారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మహిళా కార్యదర్శి లావణ్య, ఏపీఎం సునీత, సీసీ అరుణ, గ్రామ పంచాయతీ అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు బైండోవర్

పుట్లూరు, జూలై23: మండలంలోని గరుగుచింతల పల్లి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు మంగళవారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన బోరుబావి విషయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చవ్వా వెంకటనారాయణరెడ్డితోపాటు మరో ముగ్గురిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

కళ్యాణదుర్గం, జూలై 23 : గుమ్మఘట్ట మండలం తాళ్లకెర గ్రామానికి చెందిన ఈడిగ తిమ్మరాజు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో శెట్టూరు పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు. ఈడిగ తిమ్మరాజు శెట్టూరులో గత ఆరేళ్లుగా ప్రైవేటు ల్యాబ్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూ స్వగ్రామం తాళ్లకెర నుంచి శెట్టూరుకు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీన శెట్టూరుకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వస్తున్నానని ఫోన్‌చేసి తెలిపాడు. అయితే సాయంత్రమైనా రాలేదు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు అన్ని చోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో సమీప బంధువు దేవరాజు శెట్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని ఆయన కోరారు.



ఈడిగ తిమ్మరాజు

ఆధార్ కేంద్రం పరిశీలన

బొమ్మనహాళ్, జూలై 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ రఘునాథ్ మంగళవారం పరిశీలించారు. తప్పులు లేకుండా ఆధార్ తీయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ సచివాలయాలలోనూ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పిన్సిపాల్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

గుత్తి, జూలై 23: ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని గుత్తి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం కాశీవిశ్వనాథాచారి సూచించా రు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మం గళవారం ఆయన మోటార్ వా హనాల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఉంటే ప్రాణాలతో బయటపడొచ్చని తెలిపారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది గంగాధర్‌కుమార్, కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్ఓడీ హరిప్రియ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి

నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు

- మంత్రి ఆదేశంతో కదలిన యంత్రాంగం

ఉరవకొండ, జూలై 23: హెచ్చెల్సీకి మరో రెండ్రోజుల్లో నీరు రానుండడంతో నీటి పంపింగ్‌కు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని చెరువులకు యుద్ధప్రాతిపదికన నీటి పంపింగ్ చేపట్టాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్‌కు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో మండలంలోని నింబగల్లు సమీపంలో ఉన్న సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల పంపింగ్ రూంను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సఫ్రీన్, ఏఈ ఫర్వీన్ మంగళవారం పరిశీలించారు. నీటి పంపింగ్ మోటార్లను పరిశీలించి పంపింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందికి సూచించారు. 220హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్లతో పంపింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ తెలిపారు. కాలువ నుంచి నేరుగా ఫిల్టర్ బెడ్లలోకి నీటిని పంపింగ్ చేస్తామన్నారు. నీటి పంపింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.



మోటార్లను పరిశీలిస్తున్న డీఈ

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

రాయదుర్గం రూరల్, జూలై 23: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో మంగళవారం ఆయన విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2019కు ముందు టీడీపీ హయాంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిలిపివేశారన్నారు. దీని వల్ల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని కోరారు. అనంతరం జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనిల్, ఉపాధ్యక్షుడిగా సందీప్, కార్యదర్శిగా భాను ప్రకాష్, సహాయ కార్యదర్శిగా విష్ణు, కమిటీ సభ్యులుగా తిప్పేసి, శివారెడ్డి, సందీప్, వంశీ తదితరులను ఎన్నికయ్యారు.

రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈకు సన్మానం

గుత్తి,జూలై23: గుత్తిఆర్ఎస్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం వారు గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా పదోన్నతి పొందిన ప్రమోద్, రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ప్రియాంక దంపతులకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వీరికి పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మధుసుధన్‌గుప్తా సతీమణి అపర్ణ, నాయకులు మల్లికార్జునగుప్తా, మధుసూదన్‌గుప్తా, సుధీర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 26వ వార్డు సచివాలయంలో మంగళవారం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన తరుణ్‌కుమార్, ఎంటెక్ ఐఐటీలో సీటు సాధించిన మద్దినేని లక్ష్మీదీప్‌కు టీడీపీ మాజీ కౌన్సిలర్ అంజి పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం మాట్లాడుతూ 29వ వార్డులో నివాసముంటున్న తరుణ్‌కుమార్ ఇంటర్‌లో 1000/971మార్కులు సాధించాడన్నారు. అలాగే మద్దినేని లక్ష్మీదీప్ ఎంటెక్‌లో ఐఐటీలో 12వ ర్యాంక్ సాధించి బాంబే ఐఐటీ యూనివర్శిటీలో సీటు సాధించాడన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి హాజరై లక్ష్మీదీప్‌కు రూ.10వేలు అందించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక

బొమ్మనహాళ్, జూలై 23: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మంగళవారం యాదవ సంఘం మండల కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా హరేసముద్రం రామకృష్ణయాదవ్, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, మల్లికార్జున, ప్రధాన కార్యదర్శులుగా రమేష్, సొసైటీ నాగరాజు, సహాయ కార్యదర్శులుగా వన్నూరుస్వామి, హనుమంతరాయుడు, భీమప్ప, కోశాధికారిగా చంద్ర, ఉప కోశాధికారులుగా ఉలెప్ప, ఎర్రిస్వామి, ప్రచార కార్యదర్శులుగా శ్రీధర్, సిద్ధ, నరసింహ, కమిటీ సభ్యులుగా గురుమూర్తి, బొమ్మనహాళ్ ప్రకాష్, నాగేంద్ర, ఆంజనేయ, వీరేష్, రుద్రప్ప, నాగప్పను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అనంతరం సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బంగి ఉమాశంకర్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పార్టీలకతీతంగా అందరూ ఒకతాటిపై నడవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామస్వామి, జక్కల భాస్కర్, కోశాధికారి నాగరాజు, ప్రచార కార్యదర్శి ఆవుల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

యాడికి, జూలై 23: ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలన్నింటినీ అందించాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ సావిత్రి ఆదేశించారు. మండలంలోని వేములపాడు, నగరూరు, కోనుప్పలపాడు సచివాలయాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయం పనివేళల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, రాము, వసుంధర ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగన్న ఉన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

గుంతకల్లుటౌన్,జూలై23: పట్టణంలోని రైల్వే క్రీడామైదానంలో మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. నెల్లూరులో ఆగస్టు 2,3,4 తేదీలలో 11వ ఆంధ్రరాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లోజిల్లా జట్లు పాల్గొంటాయని ఆయన తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని ప్రియుడు పరారీ

కుందుర్పి, జూలై 23: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన ఓ అమ్మాయి, అదే గ్రామానికి చెందిన అబ్బాయి గత రెండుళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి ప్రియుడు పరారయ్యాడు. దీంతో ఆమె అతడి ఫొటోను, వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం మంగళవారం వైరల్ అయ్యింది. గత రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నామని, పెళ్లిచేసుకుంటానని నమ్మించాడని, చివరకు గర్భవతిని చేసి పరారయ్యాడని ఆమె సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఫోన్ నెంబర్‌ను కూడా కనబరుస్తూ అతడి ఆచూకీ తెలిస్తే వివరాలు తెలియజేయాలంటూ కోరింది. ఈ విషయంపై ఎస్ఐ వెంకటస్వామిని వివరణ కోరగా ఈ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అక్కమ్మ కొండపై సోలార్ వెలుగులు

కళ్యాణదుర్గం రూరల్, జూలై 23: పట్టణానికి తలమానికంగా వున్న అక్కమాంబ కొండపై సోలార్ వెలుగులు పడ్డాయి. పట్టణానికి చెందిన దాత ప్రబంధ్ మంగళవారం అక్కమ్మ కొండపైకి రూ. 50 వేలు విలువ చేసే సోలార్ లైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

శ్మశాన వాటికను కబ్జా నుంచి రక్షించండి

కళ్యాణదుర్గం రూరల్, జూలై 23: మండలంలోని కుర్లపల్లిలో శ్మశానవాటికను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, ఆ స్థలాన్ని రక్షించాలని కోరుతూ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజు మంగళవారం గ్రామస్థులతో కలిసి ఆర్డీవో రాణి సుష్మితకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుర్లపల్లిలో సర్వే నెంబర్ 8లో ఉన్న 4.66 ఎకరాల శ్మశాన వాటిక స్థలాన్ని గత ప్రభుత్వం లో వైసీపీ నాయకులు కబ్జా చేశారన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని ఆ స్థలాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరామకృష్ణ, గ్రామస్తులు మధు, మనోజ్, హనుమంతప్ప పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అంగన్‌వాడీ సిబ్బంది


బెళుగుప్ప, జూలై 23: మండలంలోని వెంకటాద్రిపల్లి అంగన్‌వాడీ కేంద్రం 10 గంటలు దాటినాతెరచుకోవడం లేదంటూ మంగళవారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పాటు విధులకు కూడా సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రం తెరవకపోవడంతో చిన్న పిల్లలు, గర్భిణీలు బయటే ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతుందని వాపోయారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్, జూలై 23: పట్టణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ రియాజ్ (42) టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కాగా కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తీవ్ర మనస్థాపానికి గురైన అతను రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని ఓ గదిలో ఉరివేసుకున్నాడు. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపులు పగులకొట్టి చూసేసరికి షేక్ రియాజ్ ఉరికి వేళాడుతూ కనిపించాడు. వెంటనే వారు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తండ్రి మాబు సాబ్, తల్లి క్మామూన్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండోలో పామిడి విద్యార్థిని ప్రతిభ

పామిడి, జూలై 23: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఇటీవల జరిగిన సౌత్ జోన్ తైక్వాండో పోటీలలో పామిడి విద్యార్థిని వాల్మీకి భార్గవి విశేష ప్రతిభ కనపరచింది. ఈ పోటీలో రెండు బంగారు పతకాలతో పాటు కప్ గెలవడంతో మంగళవారం కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, కోచ్ అభినందించారు. వాల్మీకి గిరి, హరిత దంపతుల కుమార్తె అయిన భార్గవి పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తైక్వాండో మాస్టర్ తులసీరాం వద్ద శిక్షణ తీసుకుంది.



బంగారు పతకాలను చూపుతున్న భార్గవి